కథ

సంక్రాంతి ప్రత్యేకం

# ఫక్కున నవ్వింది

## బత్తుల వెంకట దుర్గాప్రసాదరావు



‘‘నీ కాబోయే అత్తవారు నిన్ను పండుగకు పిలుపు వేశార్రా’’ చెప్పింది అమ్మ, నేను ఆఫీసు నుండి వచ్చీరాగానే.

అప్పటివరకూ అలసటగా వున్న నాకు ఒక్కమారుగా ఉత్సాహం వచ్చింది.

షూ విప్పి సోఫాలో కూర్చుని ‘‘ఎలా, ఎవరైనా వచ్చారా?’’ అనడిగాను ఉత్సుకతతో.

‘‘మీ మామయ్య ఫోన్ చేసి చెప్పారు. నిన్ను పండుగకు పంపమని’’ అంటూ అమ్మ చెప్పింది.

అప్పుడే గదిలో నుండి నాన్న వస్తూ ‘‘స్వయంగా వచ్చి పిలిస్తే ఎంత నిండుతనంగా వుండేది’’ అన్నారు, సోఫా ప్రక్కగా ఉన్న కుర్చీలో కూర్చుంటూ.

ఆయనకెదురుగా ఉన్న మరో కుర్చీలో అమ్మ కూర్చుంది.

''చాల్లెండి, దూరాభారం అని కూడా మనం అనుకోవచ్చు. ఐనా ఏదీ నిశ్చితార్థం జరిపి పట్టుమని పదిరోజులు కాలేదు. పెళ్లి ఇంకా నెలలోపున ఉంది. వెంటవెంటనే రాకపోకలను మనం పట్టించుకో కూడదు'' అంది.

అమ్మ మాటలు నాకు నచ్చాయి. మెచ్చుకోలుగా నవ్వేశాను.

''నీకు పండుగ మూడు రోజులు సెలవులు వుంటాయిగా. భోగినాడు వెళ్ళు, కనుమరోజు సాయంకాలం తిరిగి వచ్చేయిరా. ముచ్చటగా వుంటుంది'' చెప్పింది అమ్మ.

నాన్న ఏమీ అనలేదు. నేను కూడా పైకి ఏమీ అనలేదు. కానీ ఎప్పుడు భోగి రోజా అని లెక్కలే సుకుంటున్నాను అదెప్పుడో తెలిసున్నప్పటికినీ.

''చీర, జాకెట్టు ఇస్తాను కోడలికి పెట్టు'' చెప్పింది అమ్మ.

తలూపాను చిరునవ్వుతో.

''నువ్వు డ్రెస్ మార్చుకుని మొహం కడుక్కుని రారా. కాఫీ ఇస్తాను'' అని నాతో అంటూ అమ్మ లేచి వంటగది వైపు నడిచింది. నేనూ నా గదిలోకి కదిలాను. నామనస్సు చాలా గిలిగింతలు పెడుతోంది. ఇంతలోనే మళ్లీ స్నేహను చూడగలు గుతున్నందుకు చాలా థ్రిల్లింగ్‌గా వుంది.

స్నేహను పెళ్లి చూపుల నాడు చూశాను. అది మొదలు ఆమె రూపం నన్ను వెంటాడుతూనే వుంది. వీలు చిక్కడం ఆలస్యం నా ప్రతి తలంపు ఆమె వైపే మొగ్గుతోంది.

పేరయ్య చెప్పినప్పుడు స్నేహ పల్లెటూరు పిల్ల, ఆమెనేమి చూసేది అనుకున్నాను. కానీ ఆమెను చూసిన తర్వాత ఉబ్బితబ్బిబ్బైపోయాను. స్నేహ ఎంత బావుందో- కవినైతే కవిత్వం కురిపించే వాడిని అనునిత్యం ఆమె గురించే.

ఒడ్డూ పొడుగూ సమపాళ్లల్లో ఉండడం ఆమెకు మరింత సొగసు అమిరింది. ఆమె బంగారు ఛాయ మేనుకు అణుకువ జోడై మరింతగా ఆమెను మెరిపి స్తోంది. ఆమె మాటతీరు, వావ్ అద్భుతం. ధరించేవి ఇప్పటి ఫ్యాషన్ బట్టలు కాకపోయినప్పటికీ పట్టు చీరలో ఆమెది ఎంత పొందికైన చందం. ఏమైనా ఆమె ఒక తాజా రోజా పువ్వు అంటే అతిశయోక్తి కానేకాదు.

అమ్మ పిలుపుతో ఆలోచనల నుండి బయటపడ్డాను.

★★★

బస్సు దిగగానే నాకు ఆహ్వానం పలికారు కాబోతున్న మామయ్య. నా చేతిలోని బ్రీఫ్ కేస్‌నందుకున్నారు. తన మోటార్ బైక్ వద్దకు నన్ను తీసుకువెళ్లారు.

తారురోడ్డు వెంబడి నెమ్మదిగా బైక్ నడుపుతు న్నారు మామయ్య. ఆయన వెనుక నేను కూర్చు న్నాను. రోడ్డుకి ఇరువైపులా పొలాల్లో నువ్వు పంట మొక్కలు పచ్చగా, ఏపుగా వున్నాయి తమ నిండైన తెల్లటిపువ్వులతో. వాటిమీద నుండి పల్చటిగాలి తెరలుతెరలుగా వీస్తుండడం ఆహ్లాదంగా వుంది.

మోటార్ బైక్ సాఫీగా సాగిపోతోంది ముందుకు.

''ఈ మధ్యనే రోడ్డు మరమ్మతులు చేయించానండీ'' చెప్పారు మామయ్య గొప్పగా. ఆయన ఆ గ్రామ సర్పంచి.

ఇంటిముందు బైక్ ఆగిన శబ్దానికి లోపల నుండి నా కాబోయే అత్తయ్య బయటికి వచ్చారు చాలా ఆతృతగా, నన్ను పలకరించారు నిండుగా.

స్నేహ హాలులో ఎదురొచ్చి పలకరింపుగా నవ్వేసింది.

నేను సోఫాలో కూర్చున్నాను. ఇదివరకు చూసిన ఇల్లే కనుక మరోమారు పరికించి ఇంటిని చూడలేదు. కానీ ఇప్పుడు సున్నాలు, రంగులు, ముగ్గులతో శోభగా వుంది.

దీనిని ఇల్లు అనేకంటే ఆధునిక అమరికలతో నిండిన పూర్వపు లోగిలి అంటే సరిపోతుంది.

అత్తయ్య మంచి నీళ్లగ్లాసునందించారు.

స్నేహ మళ్ళీ కనిపించడం లేదు. స్నేహ ఏకైక సంతానం కావడంతో ఇంతింటిలో అత్తయ్య, మామయ్యలతో పాటు ఉంటున్నది ముగ్గురే. ఐనా పనివారు తిరుగుతుండబెట్టి ఇంతిల్లు అలికిడిగా అగుపిస్తోంది.

''రండి'' అన్నారు మామయ్య అప్పుడే హాలులోకి తిరిగి వచ్చి.

నేను లేచి ఆయన వెనుకే కదిలాను.

ఆయన నన్ను ఒక గదిలోకి తీసుకువెళ్లారు. ''ఈ గదిలో మీరు వుండొచ్చు. మీకు ఇక్కడ సదుపాయంగా ఉంటుంది. మీ పెట్టె అదిగో అక్కడ పెట్టాను'' చెప్పారు.

నిశ్చితార్థం నాడు మాకు వేరే గది ఇచ్చారు. ఈ గదిని పరిశీలనగా చూశాను. విశాలంగా వుంది. నీటుగా వుంది. ఉడెన్‌కాట్ ఉంది. డ్రెస్సింగ్ టేబుల్ వుంది. కుషన్ ఛైర్స్ ఉన్నాయి. టీపాయ్ వుంది. పోర్ట బుల్ టీవీ వుంది. పేయింటెడ్ వాల్స్‌కు చక్కని నృత్య భంగిమల్లో నిలువెత్తు ఉడెన్ బొమ్మలు అమర్చ బడి వున్నాయి. లాంగ్‌విండో కర్టెన్ ఉంది. డోర్ కర్టెన్ వుంది. పైగా ఎసి, సీలింగ్ ఫేనూ వున్నాయి. అటాచ్డ్ బాత్‌రూంతో టోటల్‌గా ఇది సింప్లీ మార్వలెస్.

''ఇది అమ్మాయి గది'' అంటూ ఎటాచ్డ్ బాత్ రూంను చూపిస్తూ ''స్నానం చేయండి. వేడినీళ్లు కూడా వచ్చే ఏర్పాటు అందులో ఉంది'' అన్నారు మామయ్య.

నేను తలాడించాను.

''నేను హాలులో ఉంటాను. మీరు తయారై రండి. టిఫిన్ చేద్దాం'' అని చెప్పి ఆయన అక్కడ నుండి వెళ్లిపోయారు.

నా ఫ్రెషప్ పూర్తవ్వడానికి పావుగంట పట్టింది. గదిలోనుండి బయటకు వచ్చాను. హాలులో- సోఫాలో మామయ్య కనిపించారు. అటు నడిచాను.

నన్ను చూసిన ఆయన లేచి ''రండి'' అన్నారు. నేను ఆయననుసరించాను.

ఆయన నన్ను నేరుగా డైనింగ్ హాలులోకి తీసుకువెళ్లారు. అక్కడ స్నేహ కనిపించింది. నన్ను ఓరఓరగా చూస్తోంది. డైనింగ్ టేబుల్ ముందు ఒక కుర్చీలో నేను కూర్చున్నాను. నాకెదురుగా మరో కుర్చీలో మామయ్య కూర్చున్నారు. అత్తయ్య, స్నేహలు టిఫిన్ వడ్డన చేస్తున్నారు.

★★★

స్నేహ తిరిగి లంచ్ అప్పుడే అగుపించింది. డ్రెస్ మార్చుకుంది. మొదట చీరలో ఉన్న స్నేహ ఇప్పుడు కుంకుమరంగు పట్టు లంగా, జాకెట్టు, గంధం రంగు ఓణీలో ముద్దుగుమ్మలా వుంది. పెద్ద ఎర్ర గులాబీతో తన వాలుజడ సొగసుగా, రమ్యంగా వుంది. అన్నింటికన్నా ఆమె చలాకీతనం బహు ముచ్చటగా ఉంది.

అత్తయ్య, స్నేహలు నాకు, మామయ్యకు భోజనాలు వడ్డన చేస్తున్నారు.

★★★

కాలి పట్టీల మువ్వల అలికిడి కావడంతో మంచం దిగి గది బయటకు తొంగి చూశాను స్నేహ ఏమోనని.

ఆమె కనిపించలేదు. తిరిగి గదిలోకి వెళ్లి తచ్చా డుతున్నాను.

ఆ అలికిడి మళ్లీ అయ్యింది. ఈసారి లాంగ్ విండో కర్టెన్ కొద్దిగా తొలగించి చూశాను. అక్కడ నుండి పెరటిభాగం కనిపిస్తోంది. అస్తమిస్తున్న సూర్యుని వెలుగులో ఆ పెరటిభాగం సుందరంగా



వుంది. ఎన్నెన్నో పూలమొక్కలు, తీగెలు. అవి ఎంతో క్రమమైన అమరికలో పెంచబడుతున్నట్టున్నాయి. సులభంగా నడుచుటకు వీలైన చిన్న చిన్న మలుపులతో ఎర్రకంకరరాయి దారులు. వాటికి అటు ఇటు అంచుల్లో పూలకుండీలు.

చటుక్కున నా చూపున పడింది స్నేహ. చామంతుల మొక్కల దగ్గర వుంది. చిట్టి చామంతి పువ్వులు కోస్తూ వుంది. తెల్లటి లంగా, జాకెట్, ఓణీలో వుంది. కురులు జాలువారుతున్నాయి. సన్నని గాలికి అవి లయగా కదలాడుతున్నాయి. ఆమె కోణంగి చూపులు మాటిమాటికీ లాంగ్ విండో వైపునకు చొచ్చుకువస్తున్నాయి. గబుక్కున ఆ విండో కర్టెన్లు బాగా తొలగించి ఆమె వైపు కళ్లప్పగించి చూశాను.

చెయ్యెత్తి ఆమెను అక్కడే ఉండమని, నేను రాబోతున్నానని సైగలు చేశాను. ఆమె చెంతన ఉండాలని వుంది.

కానీ ఆమె ఒక్కమారుగా గిర్రున వెనుతిరిగి గమ్మున అక్కడనుండి లోనికి వెళ్లిపోయింది.

నా మనస్సు ఉసూరుమంది.

★ ★ ★

తెల్లవారి చాలాసేపు అయ్యింది.

పేపర్ పట్టుకుని డాబా మీదకు వెళ్లాను స్నానం ముగించుకుని. అక్కడ సిమెంట్ బెంచీ వుంది. వెళ్లి దాని మీద ఎండకు వీపు చూపుతూ కూర్చున్నాను. చేతిలో పేపరు ఉందికానీ నా చూపులు స్నేహకై వెతుకుతున్నాయి.

లేచి పచార్లు కొడుతున్నాను. పెరటి భాగంలోనూ స్నేహ కనిపించడం లేదు. ముంగిట భాగంలోనూ ఆమె కానరావడం లేదు.

మామయ్య పొలం వైపు వెళ్తున్నానని చెప్పి వెళ్లి చాలాసేపైంది.

అత్తయ్య ఎక్కడ ఉన్నారో...

స్నేహ చెంత వంటరిగా వుండాలని ఉంది. ఆమెతో మాట్లాడాలని ఉంది. చొరవగా ఉండాలని ఉంది. చిలిపి చిలిపి చేష్టలు మురిపెంగా చెయ్యాలని వుంది.

స్నేహ కనిపించడం లేదు.

వీధిలో నిన్నటి భోగి మంటల్లో కాలిపోయిన కర్రలు మిగిల్చిన బూడిద చిన్న గుట్టగా అగుపిస్తోంది. అక్కడ పిల్లలు తచ్చాటలు సందడిగా, ముచ్చటగా ఉన్నాయి.

ఇంతలో డాబా మెట్లు వైపున చప్పుడు కావడంతో అటు చూశాను. స్నేహ డాబా మీదకు వస్తోంది. నన్ను చూసినంతనే టక్కున మెట్ల మీదనే నిల్చుండిపోయింది.

''మిమ్మల్ని టిఫిన్‌కు రమ్మనమంది అమ్మ'' చెప్పింది మృదువుగా.

''మీ నాన్నగారు రానీ కలిసి టిఫిన్ చేస్తాను'' చెప్పాను.

వెంటనే, ''ఈలోగా వేడి టీ కావాలి, చాలా చలిగా వుంది'' అన్నాను చిలిపిగా నవ్వుతూ.

స్నేహ కిందకు వెళ్లిపోయింది.

టీ స్నేహే తీసుకువస్తే బాగుంటుంది. అలా తెస్తోందనే కోరి టీ కావాలన్నాను.

స్నేహ కొద్దిసేపు క్రితమే స్నానం చేసినట్టుంది. మంచులో తడిచిన ముద్దబంతి పువ్వులా అనిపిస్తోంది.

ఆశించినట్టే స్నేహే టీ తీసుకువచ్చి ఇచ్చింది.

''థ్యాంక్స్'' చెప్పాను. చిన్నగా నవ్వేసి క్రిందకు పోబోతున్న ఆమెను ఆపాను.

''వెంటనే వెళ్లిపోవాలా'' అని.

ఏమీ అనలేదు స్నేహ.

ఆమె అక్కడే ఆగి ఉన్నప్పటికీ, ''ఉండొచ్చుగా'' అంటూ,

''ఈరోజు సాయంకాలం మీ నాన్నగారు మీ పొలాలు, తోటలు చూపించడానికి అటు తీసుకు వెళ్తానని చెప్పారు. నువ్వూ రాకూడదూ'' అన్నాను.

''అమ్మో, నేనూ వస్తున్నాం'' చెప్పింది స్నేహ.

స్నేహ చేతినందుకుని గోరింటాకు డిజైన్‌తో పండి ఉన్న ఆమె ముంజేతి మీద ముద్దుపెట్టుకోవాలని నాకు చటుక్కున అనిపించింది. అంతే గబుక్కున ఆమె వైపు చరచరా కదిలి ఆమె చేతిని అందుకోబోయాను. కానీ ఆమె కూడా అంతే వేగిరంగా కదిలి చకచకా కిందకు దిగిపోయింది మృదువుగా నవ్వుకుంటూ.

నేను తడబడ్డాను.

★ ★ ★

మామయ్య నాకు తన పొలాలు, తోటలు చూపుతూ ఒక పొలం గట్టుమీద ఆగిపోయారు అత్తయ్య ఏదో అడగడంతో. ఆవిడకు ఏవో హద్దులు చూపుతూ ఆయన మాట్లాడుతున్నారు. నేను వెనుకకు తిరిగాను. మాతో కలిసి వస్తున్న స్నేహ అక్కడ లేదు. ఆమె కోసం నా కళ్ళు వెతుకుతున్నాయి.

పక్కనే ఉన్న అరటితోటలో అలికిడికి అటు కదిలాను. మొక్కల మధ్య నుండి లోనికి వెళ్తుండగా, అరటిపువ్వు విరుస్తూ ఒకచోట స్నేహ కనిపించింది. చీర కుచ్చిళ్లను బొడ్డు అంచున దోపుకుని వయ్యార భంగిమలో అగుపించిన స్నేహ ఒక్కమారుగా నా మనస్సును పులకరింపచేసి, చొరవకు ఉసికొల్పింది. దాంతో చటుక్కున అటు కదిలి ఆమె చేతిని అందుకోబోయాను. కానీ ఆమె గిర్రున వెనుతిరిగి లేడిపిల్లలా చెంగుచెంగున తన తల్లిదండ్రుల వద్దకు వెళ్ళిపోయింది తడబడుతూ.

నా మనస్సు విలవిల్లాడిపోయింది.

★ ★ ★

తలవని తలంపుగా మరోసారి చక్కగా ముస్తాబై ఉన్న స్నేహ ఒంటరిగా నా చూపులకు చిక్కింది.

కనుమనాడు పశువుల పూజలంటూ కళ్లం వద్ద ఉన్న పశువులశాలకు వెళ్లారు మామయ్య. అత్తయ్య ఎక్కడో ఉన్నారు. అవకాశం కోసం చూస్తున్న నేను ఆలస్యం చేయక ఎవరిచూపుల్లో పడకుండా స్నేహ ఉన్న గదిలోకి దూరగలిగాను. ఆ గదిలోకి దూరగానే తలుపు మూసి గడియ పెట్టేయగలిగాను.

స్నేహ ఈ పరిణామాలకు కలవరపడడం గమనించగలిగిన నేను ఆమెను సముదాయిస్తూ ''గలాభా చేయక నేను చెప్పింది విను. మనం కాబోతున్న భార్యభర్తలమే కదా. కనుక శాంతంగా విను'' అన్నాను.

ఆమె అయోమయంగా నన్ను చూస్తోందే తప్ప ఏమీ అనడం లేదు.

''పెళ్లికి ముందు ఇలాంటి చేష్టలు థ్రిల్లింగ్‌గా ఉంటాయి. మురిపంగానూ ఉంటాయి. దయచేసి రభస చేయకేం'' అంటూ స్నేహను అందుకోబోయాను.


ఆమె తప్పించుకుంటూ ''అయ్యయ్యో నా మాట వినండి. ప్లీజ్. దగ్గరకు రావద్దు'' అంది గబగబా.

నేను ఆమె మాటలు పట్టించుకోవడం లేదు. ఆమెను అందుకోవాలని ప్రయత్నిస్తున్నాను.

ఆమె అటూ ఇటూ వడివడిగా కదులుతూ ''ఇది సమయం కాదు. నన్ను తాకొద్దు. నేను ఇంట్లోకి రాకూడదు. అర్థం అయిందా. అందుకే బయటకు రాకుండా గదిలోనే ఉన్నాను'' అంది కంగారుగా, భయంగా, దిగులుగా. ఆమె తడబాటుకు నేను తటపటాయిస్తూనే ఆమెను అందుకోవాలనే ప్రయత్నాన్ని విరమించుకున్నాను.

''ప్లీజ్ వెంటనే వెళ్లిపోండి'' అంది స్నేహ గబగబా చుట్టూ చూస్తూ.





నేను అప్రయత్నంగానే అక్కడ నుండి కదిలాను. గది తలుపు తీశాను.

నా గదికి చేరుకున్నాను ఎవరికంటా పడకుండా– ఉసూరుమన్న మనస్సుతో.

★★★

స్నేహకు, నాకు శోభనం ఏర్పాట్లు ఘనంగానే జరిగాయి.

స్నేహకై ఆవురావురుమంటున్న నాకు ఇప్పటికి సమయం కలిసి వచ్చింది.

నిబ్బరంగా, నిశ్చింతగా ఆమెను కౌగిలించుకున్నాను. ఆమె కూడా సౌఖ్యంగా మసలుతోంది.

''నాపై మీకున్న ఆరాటం సామాన్యమైనది కాదు స్మీ'' అంది స్నేహా ముసిముసిగా నవ్వుతూ.

ఆమెను మరింత గాఢంగా కౌగిలించుకున్నాను.

''మీకో విషయం చెప్పాలి. లేదంటే అపరాధ భావం నాలో పోదు'' అంది స్నేహ.

ఆమెను వదలకనే అడిగాను ''ఏమిటిట?''

''పండుగకు వచ్చిన మీరు ప్రదర్శించిన చొరవకు నేను ఎంతగానో బేజారుపడ్డాను తెలుసా. ముఖ్యంగా ఆరోజు ఒంటరిగా గదిలో సామాన్లు తీస్తున్న నన్ను పట్టేయ్యాలన్న మీ తీరుకు, మీ చేష్టలకు చలించిపోయాను. హడలిపోయాను మరి. అప్పుడా సమయాన నాకా ఆలోచన రాకపోయి అబద్ధం ఆడకుండా ఉంటే ఏమైయ్యేదో కదా'' అంది స్నేహ.

నేను షాకయ్యాను. ఆమెను వదిలేశాను.

''అంటే అప్పుడు నువ్వు బైట వుండడం నిజం కాదా?'' అడిగాను.

''అప్పటికి తప్పించుకోవడానికి అలా ఆ మాట చెప్పేశాను. నిజానికి నేను అప్పుడు ఇంట్లోకి రావచ్చు'' అంది స్నేహ మురిపెంగా.

''అవునా, ప్చ్, అదో థ్రిల్ అని. మనం ఎలాగూ పెళ్లి చేసుకోబోతున్న వారిమేనని ఎంతగానో చెప్పానుగా. ఎందుకు నా మీద అపనమ్మకం వచ్చింది'' అన్నాను నిష్టూరంగా.

''అయ్యో అపనమ్మకం కాదు, మన సంప్రదాయం అన్నా, సంస్కృతి అన్నా నాకు ఎంతో గౌరవం, అభిమానం. కట్టుబాట్లు అర్థవంతమైనవని నా నమ్మకం. విలువలు వీడడం క్షమించరాని నేరం. అందుకే అప్పుడలా ప్రవర్తించక తప్పలేదు. అపార్థం చేసుకోవద్దు. మీరూ ఒకమారు ఆలోచించండి. ప్లీజ్'' అంటూ–

చిన్నగా నవ్వి, ''ఈ నా భావనలు నేను చెప్పినా మీరు వినే స్థితిలో అప్పుడు లేరుగా'' చెప్పింది స్నేహ అనునయంగా.

స్నేహ తీరు నన్ను ఆకట్టుకుంది. అర్థం చేసుకున్నాను నిజంగా.

మెచ్చుకోలుగా ఆమెను చూశాను. ఆమె చూపుల్లో మెరుపు నన్ను ఆకట్టుకుంది.

ప్రేమగా స్నేహను దగ్గరగా తీసుకున్నాను. ఆమె కళ్లల్లోకి చూస్తూ ఉండిపోయాను.

ఆమె కనురెప్పలను మూసుకుంది. వాటిపై మెల్లగా చెరో ముద్దుపెట్టాను. ఆమె మరింత చేరువయింది.

ఆమెను మరింత గాఢంగా కౌగిలించుకున్నాను.

హఠాత్తుగా ''ఒక్కమారు వదలండి'' అంది స్నేహ గాభరాగా.

నేను ఆమెను వదిలాను.

''సారీ'' రెండుచేతులూ జోడించి చెప్పింది స్నేహ. ఆ వెనువెంటనే గది విడిచి గబగబా బయటకు వెళ్లిపోయింది.

నేను అయోమయంలో పడ్డాను.

కొద్దిసేపటికి నా వద్దకు అమ్మ వచ్చింది.

''మీ ఫస్టునైట్ వాయిదా పడిందిరా. కోడలు బైట ఉంది'' అని చెప్పింది.

నేను ఉక్కిరిబిక్కిరయ్యాను.

''ఏంటో పాపం! ఈ విషయంలో ఓ పద్ధతీ–పాడూ లేకుండా పోయిందట'' అంది మళ్లీ.

''నువ్వు పడుకో'' అని చెప్పి, అమ్మ వెళ్లిపోయింది.

రుమాలుకై నా చెయ్యి లాల్చీ జేబులోకి వెళ్లింది.

స్నేహ కొంగుముడిని కట్టాలనుకున్న బంగారు గొలుసు ఆ చేతికి తగిలింది.

నా మనస్సు ఫక్కున నవ్వింది.

★